క్లుప్తంగా

కుస్తీ పోటీల్లో కార్తీక్‌కు బంగారు పతకం



అండర్-15లో బంగారు పతకం సాధించిన కార్తీక్

అమీర్‌పేట: బల్కంపేట వీర హనుమాన్ వ్యాయామశాలకు చెందిన గౌలికార్ మణికంఠ (కార్తీక్) బంగారు పతకం సాధించాడు. యాకుత్‌పురాలోని అలీ ఉస్తాద్ అకాడమీలో జరిగిన అండర్-15 తెలంగాణ కుస్తీ చాంపియన్‌షిప్ పోటీల్లో కార్తీక్ పాల్గొన్నారు. 75 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించి త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని వ్యాయామశాల నిర్వాహకులు బత్తుల రాజేశ్వర్ (ఖలీఫా) తెలిపారు.విజేత కార్తీక్‌ను పలువురు అభినందించారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించండి



హైదరాబాద్ కలెక్టర్‌ను కలిసిన దివ్యాంగ సంఘం నేతలు

లాలాపేట: జిల్లాలోని దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భాతర వికలాంగుల హక్కుల వేదిక నాయకులు బుధవారం కలెక్టర్ హరిచందనను కోరారు. హైదరాబాద్ జిల్లాలోని దివ్యాంగులు పలుసమస్యలు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కోలీ నాగేశ్వర్‌రావు, జంగిలి శ్రీనివాస్, పంది శ్రీనివాస్ తదితరులున్నారు.

మహిళపై దాడికి ఖండన

ఉస్మానియా యూనివర్సిటీ: అప్పు చెల్లించలేదని మహిళను చెట్టుకట్టివేసి తీవ్రంగా కొట్టి గాయపర్చడాన్ని సామాజిక విప్లవ కారుడు డా.ప్రేమ్‌కుమార్ ఖండించారు. బుధవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ ఏపీలోని కుప్పం నియోజవర్గంలో జరిగిన ఈ అమానవీయ దుర్ఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేల చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నియోజక వర్గంలో జరిగిన ఈ దారుణానికి ఆయనే బాధ్యత వహించి దోషులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.


28న విశ్వకర్మ సంఘం ఎన్నికలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ కడియాల శ్రీనివాసులు తదితరులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పాట్ మార్కెట్ స్థానిక విశ్వకర్మ సంఘం ఎన్నికలు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కన్వీనర్ కడియాల శ్రీనివాసులు వెల్లడించారు. బుధవారం పాట్ మార్కెట్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 20న నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. ఉపసంహరణ 21 సాయంత్రం 3వరకు ఉంటుందని తెలియజేశారు. ఎన్నికలు జూన్ 28న ఉంటాయన్నారు. ఎన్నికల ప్రధాన అధికారిగా రాఘవాచారి, పరిశీలకులుగా వెంకటస్వామి, ఇన్‌చార్జీలుగా సతీష్‌కుమార్‌లు వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో సంఘం నాయకులు రాజు, శేఖర్, ప్రసాద్, కె. వినోద్, బ్రహ్మచారీ, నర్సింహచారీ, రాములు పాల్గొన్నారు.

24న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ



కంటోన్మెంట్: ఈ నెల 24న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభను విజయవంతం చేయాలని సంఘం గౌరవ అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాసభ పోస్టర్‌ను బుధవారం జూబ్లీ బస్ స్టేషన్ వద్ద జరిగిన ఆర్టీసీ ఉద్యోగుల సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బీసీలందరు ఐక్యంగా సంఘటితం అయినప్పుడే హక్కులను సాధించుకోవడం సులభతరం అవుతుందన్నారు.

కమ్యూనిటీ హాళ్లు ఉన్నా ప్రయోజనం సున్నా

- ప్రభుత్వమే వాడుకుంటున్న కమ్యూనిటీ భవనాలు
- ప్రజలకు దూరమైన సామాజిక భవనాలు
- లష్కర్ ప్రజలకు తప్పని ఇబ్బందులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు కమ్యూనిటీ హాళ్ల సేవలు క్రమేణా దూరం అవుతున్నాయి. అందుబాటులో ఉన్న కమ్యూనిటీహాళ్లను వివిధ అవసరాల నిమిత్తం అధికారులు స్వాధీనం చేసుకుంటుండడం, కొత్తగా ప్రతిపాదించిన కమ్యూనిటీహాళ్లు అందుబాటులోకి రాకపోతుండడంతో కమ్యూనిటీహాళ్ల వ్యవహారం ఆద్యంతం సమస్యాత్మకంగా మారింది. రెండేళ్ల క్రితం వరకు ప్రజలు పలు కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అందుబాటులో ఉన్న కమ్యూనిటీహాళ్లు వినియోగించుకునేవారు. ప్రజల అవసరాల కోసం నిర్మించి ఇచ్చిన కమ్యూనిటీహాళ్లు తిరిగి ప్రభుత్వ విభాగాల అధికారులే స్వాధీనం చేసుకోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు హాళ్లను ఆశ్రయించడం లేదంటే రహదారులపైనే కార్యక్రమాలు నిర్వహించుకునే పరిస్థితులు ఎదురవుతున్నాయి.

అందుబాటులోకి కమ్యూనిటీహాళ్లు..

లష్కర్ ప్రజలు చిన్నపాటి నుంచి ఓ మోస్తరు శుభకార్యాలు నిర్వహించుకోవడం కోసం, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కోసం ప్రభుత్వం వీటిని నిర్మించింది. ఇరవై ఏళ్ల క్రితం ఈ ప్రాంత ప్రజలు చిన్నపాటి శుభకార్యాలను రహదారులపైనే నిర్వహించుకునే వారు. కమ్యూనిటీహాళ్లు అందుబాటులోకి వచ్చాక నామమాత్రపు ఖర్చుతోనే



బౌద్ధనగర్‌లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాలులో కొలువుదీరిన వారాసీగూడ పీస్, ఏసీపీ, జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయాలు

సమీపంలోని కమ్యూనిటీహాళ్లలో శుభకార్యాలు ఇతరత్రా కార్యక్రమాలు వెళ్లదీసుకునేవారు. జీహెచ్‌ఎంసీ, ఎమ్మెల్యే, ఎంపీలాడ్స్ నిధులతో అన్ని డివిజన్లలో అవరమైనన్ని కమ్యూనిటీ హాళ్లు అందుబాటులోకి వచ్చాయి.

బదలాయించారిలా..

ప్రభుత్వ అధికారుల కార్యకలాపాల కోసం ప్రజల సామాజిక భవనాలను కేంద్రాలుగా చేసుకున్నారు. నియోజకవర్గంలోని దాదాపు 30 వరకు కమ్యూనిటీళ్లను ఇప్పటికే వివిధ విభాగాల ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. పేద ప్రజలకు పెద్దదిక్కుగా ఉండే బౌద్ధనగర్‌లోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాలు పోలీసు శాఖ వశమైంది. వారాసీగూడ పీఎస్, చిలకలగూడ ఏసీపీ, వార్డు కార్యాలయాన్ని ఇందులో ఏర్పాటు చేశారు. మేడిబావి కమ్యూనిటీ హాలులో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు ఏర్పాటు చేశారు. ఐదు డివిజన్లలోని పలు కమ్యూనిటీహాళ్లలో బస్తీ దవాఖానాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేశారు. సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్‌హాలు, మధురానగర్‌లోని ఓ మోస్తరు కమ్యూనిటీ హాలు మాత్రమే ప్రజల అవసరాల కోసం మిగిలి ఉన్నాయి.

వ్యక్తమవుతున్న నిరసనలు

ప్రజల అవసరాల కోసం నిర్మించిన సామాజిక భవనాలను ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు వినియోగించుకోవడం పట్ల స్థానికంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించుకోవాలి, లేనిపక్షంలో అద్దె భవనాలు వినియోగించుకోవాలి కానీ ప్రజలకు ఉపయుక్తంగా ఉండే కమ్యూనిటీహాళ్లను స్వాధీనం చేసుకోవడం సమంజసం కాదంటున్నారు. కమ్యూనిటీహాళ్లను ఆసాంతం అధికారులు స్వాధీనం చేసుకోవడంతో తిరిగి చిన్నపాటి కార్యక్రమాలను రహదారులపైనే నిర్వహించుకునే దుస్థితి ఈ ప్రాంత ప్రజలకు దాపురించిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం



బౌద్ధనగర్‌లో ప్యాచ్ వర్క్ పనులు చేయకుండా వదిలేసిన అధికారులు

బౌద్ధనగర్: అస్తవ్యస్తంగా ఉన్న అంతర్గత రోడ్లకు తగిన మరమ్మతులు చేయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని బస్తీవాసులు కోరుతున్నారు. డివిజన్‌లోని వారాసిగూడ, మసీదు ఏరియా, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనుల నిమిత్తం రోడ్లు తవ్వారు. పనులు పూర్తి అయిన తరువాత సంబంధిత అధికారులు రోడ్లు వేయకుండా వదిలేసి వెళ్లిపోయారు. దీంతో నిత్యం రాకపోకాలు సాగించే ప్రయాణికులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వృద్ధులు, వికలాంగులు ఆ దారిగుండా నడవలేకపోతున్నారు. వాహనదారులు సైతం పలు సందర్భాల్లో అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. నెలలు గడుస్తున్నా రోడ్లు వేయకుండా అధికారులు వహిస్తున్న అలసత్వాన్ని వీడి వెంటనే నూతన రోడ్లు వేయాలని, పలు కాలనీల్లో ప్యాచ్ వర్క్ పనులు కూడా పూర్తి చేయాలని డివిజన్ వాసులు కోరుతున్నారు.

బంగారం వ్యాపారి నుంచి రూ.72 లక్షలు తీసుకొని పరార్

తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని నమ్మించి మోసం

రాంగోపాల్‌పేట: తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామని చెప్పి ఓ గ్యాంగ్ బంగారం వ్యాపారి నుంచి రూ.72 లక్షలు తీసుకుని ఉడాయించింది. ఈ ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన హీరారాం బంగారం వ్యాపారం చేస్తుంటారు. ఆయనకు పాట్‌మార్కెట్‌లో షాపుతో పాటు శివాజీనగర్‌లో ఆఫీస్ ఉంది. ఇతనికి రాదేశ్యాం అనే వ్యక్తితో పరిచయం ఉంది. రాదేశ్యాం తక్కువ ధరకు బంగారం అమ్మే వ్యక్తులు ఉన్నారని హీరారాంకు చెప్పాడు. దీంతో బుధవారం మధ్యాహ్నం ఎస్డీ రోడ్‌లోని సింధ్ బేకరీ వద్ద రాధేశ్యాం అనే వ్యక్తి వర్మ, టోని, దినేష్, కేశవ్‌లను హీరారాంకు కలిపించాడు. తక్కువ ధరకు బంగారం ఇస్తామని ఈ ముఠా సభ్యులను నమ్మడంతో తన కార్యాలయంలో నగదు ఉందని హీరారాం చెప్పాడు. రాంబాబు అనే వ్యక్తి హీరారాంకు చెందిన కార్యాలయానికి వెళ్లి నగదును తనిఖీ చేసి నగదు ఉందని ముఠా సభ్యులకు సమాచారం అందించారు. సాయంత్రం 7గంటల సమయంలో ఈ ముఠాలోని నలుగురు సభ్యులు శివాజీనగర్‌లోని హీరారాంకు చెందిన కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో హీరారాంతో పాటు రాధేశ్యాం కార్యాలయంలో ఉన్నారు. ఇద్దరిపై దాడి చేసిన నిందితులు కారులో రూ.72 లక్షలు తీసుకుని పరారయ్యారు.

నిందితులు నలుగురు కారులు డబ్బుతో ఉడాయించగా జేబీఎస్ వద్దకు వెళ్లగానే మరో వ్యక్తి నగదు ఉన్న బ్యాగును వీరి నుంచి లాక్కుని ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. వెంటనే ఫిర్యాదు అందుకున్న మార్కెట్ పోలీసులు విచారణ చేపట్టి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో మొత్తం 10 మంది ముఠా సభ్యులు ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి



ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న నర్సింగ్‌రావు

అడ్డగుట్ట: తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించాలని ట్రాఫిక్ సమస్య తీరుతుందని డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్ రావు విన్నవించారు. బుధవారం అడ్డగుట్టకు చెందిన పలువురు సీనియర్ నాయకులు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్ రావు మాట్లాడుతూ తుకారాంగేట్‌లోని ఆర్‌యూబీ వద్ద ఉదయం, సాయంత్రం సమయాల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్నారు. వాహనదారులు ఆర్‌యూబీ వద్ద యూటర్న్ తీసుకోకుండా నేరుగా సుభాష్ బొమ్మ వైపు వస్తున్నారని, దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందన్నారు. అందువల్ల సూచిక బోర్డు ఏర్పాటు చేసి ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమిస్తే ట్రాఫిక్ సమస్యను పరిష్కరించవచ్చని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. బస్తీ వాసులు గంగారాం, సత్యనారాయణలు ఉన్నారు.

ఈ నెల 30 వరకు రేషన్ సరుకుల పంపిణీ

రాంగోపాల్‌పేట: చౌకధరల దుకాణాల్లో ఈ నెల 30వ తేదీ వరకు మూడు నెలల రేషన్ సరుకులు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ 9వ సర్కిల్ సహాయ సరఫరా అధికారి (ఏఎస్‌వో) చాముండేశ్వరి తెలిపారు. ఈ పాటికే సర్కిల్ పరిధిలో 75 శాతం లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారని మిగతా 25 శాతం మంది కూడా తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి రేషన్ షాపును తమ సిబ్బంది పర్యవేక్షిస్తూ తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నారని ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. మూడు నెలల రేషన్ ఒకే సారి ఇస్తుండటంతో కొంత ఆలస్యం జరుగుందని అయినా వృద్ధులు, వికలాంగులు వస్తే వారికి మొదటి ప్రాధాన్యతతో సరుకులు ఇచ్చి పంపించాలని డీలర్లకు సూచించినట్లు తెలిపారు.

ఓపెన్ కాని టీజీ సీపీజీఈటీ వెబ్‌సైట్

నిలిచిపోయిన దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: టీజీ సీపీజీఈటీ-2025 వెబ్‌సైట్ తెరుచుకోలేనందున ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ నెల 18 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు ఈ నెల 13న ప్రకటించినా బుధవారం రాత్రి 8 గంటల వరకు వెబ్‌సైట్ తెరుచుకోనందున అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా మూడు యూనివర్సిటీల నుంచి కోర్సుల వివరాలు వెల్లడించనందున దరఖాస్తుల స్వీకరణను వాయిదా వేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

పెట్టుబడి పేరుతో రూ.89వేలు టోకరా

సనత్‌నగర్: పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మోసం చేసి రూ.89,500 కాజేశారు. బేగంపేట పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట మయూరిమార్గ్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి శ్రీనాథ్ వాట్సప్, టెలిగ్రామ్‌లకు ఇటీవల గుర్తు తెలియని అగంతకులు పలు సందేశాలను పంపారు. పెట్టుబడి పెడితే అధికంగా లాభాలు వస్తాయని నమ్మించడంతో బాధితుడు వారిని సంప్రదించాడు. తొలుత కొన్ని టాస్క్‌లను ఇచ్చిన అగంతకులు స్వల్ప మొత్తంలో డబ్బును పంపారు. దీంతో నమ్మిన బాధితుడిని పెట్టుబడులు పెట్టాలంటూ సూచించారు. మూడు దఫాలుగా మొత్తం రూ.89,500లను పంపడంతో ఇంకా డబ్బు పంపాలని సూచించారు. అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ సెల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో మంగళవారం బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

నిషేధిత విదేశీ సిగరెట్లను నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్టు

సనత్‌నగర్: నిషేధిత విదేశీ సిగరెట్లను భారీగా నిల్వ ఉంచిన వ్యక్తిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన మేరకు.. పోలీసులు నిర్వహించిన నిర్బంధ తనిఖీల్లో భాగంగా బేగంపేటలోని పాటిగడ్డలో ఓ వ్యక్తి విదేశీ సిగరెట్లను నిల్వ చేసి సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. డీసీపీ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు బేగంపేట పోలీసులు మహ్మద్ మక్బుల్ (42) అనే పాన్ షాప్ యజమానిపై కేసు నమోదు చేశారు. మక్బుల్ తన ఇంట్లో దాచిన రూ.3,84,300 విలువ చేసే వివిధ బ్రాండ్లకు చెందిన 449 పెట్టెల విదేశీ సిగరెట్లను, మాదక ద్రవ్యాల కోసం వినియోగించే బాంగ్సీ రోలింగ్ పేపర్లను స్వాధీనం చేసుకున్నారు. మక్బుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐసీ-సీసీఎంబీ సెంటర్ ప్రారంభం

లాలాపేట: థర్మోఫిషర్ సైంటిఫిక్, అటల్ ఇంక్యూబేషన్ సెంటర్-సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(ఏఐసి-సీసీఎంబి) హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సరఫరా కేంద్రాన్ని బుధవారం సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్ కుమార్ నందికూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లైఫ్ సైన్సెస్ పరిశోధనను బలోపేతం చేయడానికి ఈ సప్‌లై సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సీసీఎంబీ చుట్టుపక్కల సంస్థలల్లో కొనసాగుతున్న భవిష్యత్ పరిశోధనల వేగాన్ని ఈ సరఫరా కేంద్రం పెంచుతుందనీ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆటల్ ఇంక్యూబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ ఎస్. మధుసూదన్‌రావు, పలువురు శాస్త్రవేత్తలు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సీసీఎంబి డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్ నందికూరి

రైల్వే జీఎంకు సత్కారం

సికింద్రాబాద్: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా పదవీ విరమణ చేయనున్న అరుణ్ కుమార్ జైన్‌ను మజ్దూర్ యూనియన్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. సికింద్రాబాద్‌లోని యూనియన్ కేంద్ర కార్యాలయంలో జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ జనరల్ సెక్రెటరీ శంకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ జీఎంగా అరుణ్ కుమార్‌జైన్ సేవలు మరువలేనివి అన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి అరుణ్ కుమార్ పెద్దపీట వేశారని చెప్పారు. కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే అదనపు జీఎం నీరజ్ అగర్వాల్, జీఎం కార్యదర్శి శ్రీనివాస్, రైల్వే ఉన్నతాధికారులు బ్రిజ్ మోహన్ మీనా, నిర్మల రాజారామ్, ఆరోమా ఠాగూర్, సిద్దార్థ, మురళీధర్, యూనియన్ నాయకులు ఉదయభాస్కర్, రామకృష్ణ, భారటీ, శ్రీనివాస్ రెడ్డి, సరోజినీ రెడ్డి రవీందర్ పాల్గొన్నారు



రైల్వే జీఎంను సత్కరిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

21న ఓయూలో బీసీ సత్యాగ్రహ దీక్ష



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 21న బీసీ సత్యగ్రహ దీక్షను చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐబీసీఎస్ఏ) జాతీయ కార్యదర్శి మహేష్ గౌడ్ తెలిపారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణం భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న దీక్షను చేట్టనున్నట్లు చెప్పారు. ఏఐబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షులు కిరణ్‌కుమార్, లక్కీ, రామ్‌గౌడ్, ప్రశాంత్, శివయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులకు నిధులు మంజూరు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని నాలా పునర్నిర్మాణం పనులకు నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతాఫల్ మండి డివిజన్‌న్ భవాన్‌నగర్ నుండి మహ్మద్ గూడ వరకు ఆవరించి ఉన్న నాలా సమస్మాత్మకంగా మారిందన్నారు. 2022 నవంబర్‌లో జరిగిన జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిధులు మంజూరైనా ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్ అమలు కాలేదన్నారు.

మోకాళ్ల నొప్పులు తగ్గిస్తామంటూ మోసం

- ప్రకృతి వైద్యం పేరుతో టోకరా
- నలుగురు అంతర్రాష్ట్ర నిందితుల అరెస్టు
- మరో ఇద్దరు పరారీ

రాంగోపాల్‌పేట: ప్రకృతి, ఆయుర్వేద వైద్యంతో మోకాలి నొప్పులు నయం చేస్తామని చెప్పి మోసాలకు పాల్పడుతున్న నలుగురు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను రాంగోపాల్‌పేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు తెలిపిన మేరకు.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మంజు దుర్గప్ప బాగల్‌కోటి, గోవింద్ బాగల్ కోటి, కిరన్ గోవిందప్ప శాస్త్రి గోల్, కేశవ్ బాగల్‌కోటి, రవిశెట్టి, సురేష్‌లు లంగర్‌హౌజ్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వీరు ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల వద్దకు వెళ్లి మోకాలి నొప్పులతో బాధపడుతున్న వారిని పరిచయం చేసుకునేవారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందని తమకు తెలిసిన వారి వద్ద యుర్వేదం, ప్రకృతి వైద్యంతో మా బంధువులకు పూర్తిగా నయం అయిందని నమ్మిస్తారు. తర్వాత వారిని నల్లకుంటలో వైద్యులుగా చలామణి అయ్యే సురేష్, రవిశెట్టిల వద్దకు తీసుకుని వెళ్తారు. రోగుల వద్ద నుంచి మందులు, వైద్యం పేరుతో దఫదపాలుగా రెండు లక్షల వరకు లాగుతారు. ఇలాగే ఈ నెల 13వ తేదీన వరంగల్‌కు చెందిన సువర్ణ మినిస్టర్ రోడ్‌లోని కిమ్స్ ఆస్పత్రికి రాగా ఆమెను ఇలాగే మోసం చేసేందుకు యత్నించగా అప్పటికే నిఘా పెట్టిన రాంగోపాల్‌పేట్ పోలీసులు అక్కడికి చేరుకునే లోపు ఉడాయించారు. బుధవారం మరోమారు కిమ్స్ ఆస్పత్రి వద్దకు రాగా పోలీసులు అరెస్టు చేశారు. వైద్యులుగా చలామణి అయ్యే సురేష్, రవిశెట్టిలు పరారీలో ఉన్నారు. నిందితులు గతంలో కూడా మలక్‌పేట్, పంజాగుట్ట, మధురానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇలాగే మోసాలకు పాల్పడి జైలుకు వెళ్లి విడుదల అయిన తర్వాత కూడా మళ్లీ అలాంటి నేరాలకు పాల్పడుండటం గమనార్హం.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

బన్సీలాల్‌పేట్: ప్రజల కనీస సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పలు ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, వెంకటేషన్‌రాజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. ప్రజలు సూచించిన సమస్యలను సకాలంలో పరిష్కరిస్తున్నామన్నారు. గతంతో పోల్చుకుంటే బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్, బోయిగూడ తదితర ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు వేయించామన్నారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ దాకు నాయక్, జలమండలి జీఎం వినోద్, స్థానిక నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, జి. పవన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.



ముస్లిం బస్తీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

గ్రూప్-4 ఉద్యోగులకు శిక్షణ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో గ్రూప్-4 ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. బుధవారం ఓయూ క్యాంపస్‌లోని ఎంఎంటీసీ ద్వారా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని వీసీ ప్రొ.కుమార్ ప్రారంభించి మాట్లాడారు. పరిపాలనా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు కొత్తగా చేరిన గ్రూప్-4 ఉద్యోగులకు శిక్షణ ఇస్తునట్లు అధికారులు తెలిపారు.

కలుషిత జలాల సమస్య పరిష్కారానికి కృషి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో కలుషిత జలాల సరఫరా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. డివిజన్ పరిధిలోని మేడిబావి, మైలార్‌గడ్డ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించి ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. మైలార్‌గడ్డ బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రక్క గల్లీలో మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా కలుషిత జలాలు సరఫరా అవుతున్నట్లు గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. మేడిబావిలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, నిధులు మంజూరు అయినవెంటనే నిర్మాణపనులు చేపడతామన్నారు.

అధిక ఫీజులను నియంత్రించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో అధిక ఫీజులను నియంత్రించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఫీజులను ఇష్టారాజ్యాంగా పెంచి వసులు చేస్తున్న ప్రైవేటు జూనియర్ కాలేజీల పై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ప్రైవేటు జూనియర్ కాలేజీల్లో ఫీజులను నిర్ణయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.